క్లుప్తంగా

ఇంటి పన్ను సకాలంలో చెల్లిస్తే వడ్డీ మినహాయింపు

పొదిలి: నగర పంచాయతీ ప్రజలు ఇంటి పన్ను సకాలంలో చెల్లించినట్లయితే మార్చి నెల నుంచి వడ్డీ మినహాయింపు పొందవచ్చని కమిషనర్ శ్రీనివాసరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్ను ఈనెల 28వ తేదీలోగా చెల్లించాలని కోరారు. సెలవు దినాల్లో కూడా నగర పంచాయతీ కార్యాలయంలోని ప్రత్యేక కౌంటర్‌లో పన్ను చెల్లించవచ్చని స్పష్టం చేశారు. ఇంటి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లించి నగర పంచాయతీ అభివృద్ధి సహకరించాలని కమిషనర్ విజ్ఞప్తి చేశారు.

ప్రారంభానికి సిద్ధమైన విద్యుత్ సబ్‌స్టేషన్



మేడంవారిపల్లెలో నూతన సబ్‌స్టేషన్

రాచర్ల: మండలంలోని సోమిదేవిపల్లె, గుడిమెట్ట, రామాపురం, సత్యవోలు, శీలంవెంకటరెడ్డిపల్లె, సంగపేట, మేడంవారిపల్లె, ఒద్దులవాగుపల్లె గ్రామాల్లో విద్యుత్ లోఓల్టేజీ సమస్యతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతుండటంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సబ్‌స్టేషన్ మంజూరు చేసింది. మేడంవారిపల్లె గ్రామంలో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.30 లక్షలు మంజూరు చేయడంతో 2024 జనవరి 6వ తేదీన అప్పటి ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు చేతులమీదుగా భూమి పూజ చేశారు. ప్రస్తుతం సబ్‌స్టేషన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకోవడంతో త్వరలోనే ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హనుమంత వాహనంపై వేణుగోపాలుడు



హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న వేణుగోపాలస్వామి

తర్లుపాడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా తర్లుపాడులోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆదివారం భక్తులకు హనుమంత వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలు కశ్శెట్టి జగన్‌బాబు దంపతులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్, ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా సుబ్రమణ్యం



సుబ్రమణ్యంను సన్మానిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

బేస్తవారిపేట: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. సంఘ మండల అధ్యక్షుడిగా జక్కా సుబ్రమణ్యంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ నాయకుడు ముల్లా శ్రీనివాసరావు, క్లాత్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శేగు ప్రసాద్, మాజీ మండల ఉపాధ్యక్షుడు బళ్లాని సుబ్బరత్నం, టౌన్ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు జక్కా కుమార్, యువజన సంఘ అధ్యక్షుడు వి.జగదీష్‌కుమార్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

పొదిలి: నగర పంచాయతీ పరిధిలోని కాటూరివారిపాలెంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో 5 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి ప్రారంభించారు. అలాగే చెత్త సేకరణ ట్రాక్టర్‌ను నగర పంచాయతీ కార్యాలయం వద్ద ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు గునుపూడి భాస్కర్, ముల్లా ఖుద్దూస్, ఓబులరెడ్డి, రైతు సంఘ నాయకుడు అవులూరి యలమంద తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

కంభం: మండలంలోని లింగాపురం గ్రామంలో 17 ఏళ్ల వయసున్న ఓ యువతి కనిపించకుండా పోవడంపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు ఉదయం పనికి వెళ్లే సమయంలో ఇంట్లోనే ఉన్న కుమార్తె తిరిగి వచ్చేసరికి కనిపించకపోవడంతో చుట్టుపక్కల వెతికారు. అయినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బేస్తవారిపేట/కొమరోలు/కొనకనమిట్ల:

సంక్రాంతికి గుంతలు లేని రోడ్లు సిద్ధం చేస్తామని కూటమి ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. 'సంక్రాంతికి దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు వచ్చే వారు రోడ్లు బాగోలేవని సోషల్ మీడియాలో పోస్టులు పెడితే సంబంధిత ఎమ్మెల్యేలపై యాక్షన్ తీసుకోవాల్సి వస్తుంద'ని సీఎం చంద్రబాబునాయుడు సెలవిచ్చారు. ఆ తర్వాత రహదారుల మరమ్మతులు, నూతన రహదారులు అంటూ కూటమి నాయకులు తెగ హడావిడి చేశారు. కానీ క్షేత్ర స్థాయిలో రోడ్ల పరిస్థితి మారలేదు. చాలా చోట్ల రోడ్లు అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల మెయిన్ రోడ్లపై గుంతలను తూతూ మంత్రంగా పూడ్చి సరిపెట్టారు. సంక్రాంతి పండగ అయిపోయి శివరాత్రి వస్తున్నా రోడ్లపై గుంతలు పూడ్చకపోవడంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో బేస్తవారిపేట మండలంలోని కోనపల్లె లోయ రోడ్డు మరమ్మతు పనులను ఆర్అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్దనరెడ్డి పరిశీలించారు. జిల్లాలో రూ.21 కోట్లతో 1313 కిలోమీటర్ల మేర రోడ్ల మరమ్మతులు వేగంగా చేస్తున్నట్లు చెప్పారు. మంత్రి వచ్చి వెళ్లి మూడు నెలలైనా రోడ్ల తీరులో ఆశించిన మార్పు లేదు. కానీ రోడ్ల మరమ్మతుల పేరుతో కూటమి నాయకులు సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా ప్రచారం పొందారు.



బేస్తవారిపేట : లోతైన గుంతలతో ఒంగోలు-నంద్యాల హైవేరోడ్డు

సంక్రాంతి పాయే.. శివరాత్రి వచ్చే..!

మెయిన్ రోడ్లు, పల్లె దారుల్లో ప్రయాణం.. వాహనదారులు, ప్రజలకు నిత్య నరకం

- సంక్రాంతికి గుంతలు లేని రోడ్లంటూ కూటమి నేతల హడావుడి
- నేటికీ మరమ్మతులకు నోచుకోని రహదారులు
- నాణ్యత పాటించకపోవడంతో పలుచోట్ల దెబ్బతిన్న ప్యాచ్‌లు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

☛ బేస్తవారిపేట మండలంలోని కోనపల్లె రోడ్డు మరమ్మతుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్డుకు ఇరువైపులా మార్జిన్లు లోతైన గుంతలతో దర్శనమిస్తుండగా ప్యాచ్ వర్క్ పనులు సక్రమంగా చేయకపోవడంతో అక్కడక్కడా గుంతలు అలాగే ఉన్నాయి. ఒంగోలు-నంద్యాల హైవే మరమ్మతు పనులదీ ఇదే తీరు. బేస్తవారిపేట జంక్షన్ నుంచి తాడివారిపల్లె వరకు పనులే ప్రారంభించలేదు. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే హైవే కావడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ మండల కేంద్రమైన అర్ధవీడు అర్ధవీడు నుంచి దొనకొండ వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలమయంగా మారింది. నిత్యం వాహనాలు రాకపోకలు సాగించే ఈ రోడ్డుపై లోతైన గుంతలు ఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

☛ కొమరోలు మండలంలోని గోపాలునిపల్లె గ్రామం నుంచి సూరవారిపల్లె గ్రామానికి వెళ్లే రహదారి ఇప్పటికీ గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డులో సూరవారిపల్లి, మొట్టుపల్లి, బొడ్డువానిపల్లి, పోసుపల్లి, గోనపల్లి గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. రోజూ వందల సంఖ్యలో వాహనాలు తిరిగే ఈ రహదారి గుంతలమయంగా ఉండటంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే అల్లినగరం నుంచి యర్రగుంట్ల గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణ పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొట్టుపల్లె నుంచి గుంతపల్లెకు వెళ్లే తారురోడ్డు ఛిద్రం కావడంతో గుంతపల్లె గ్రామస్తులు నరక యాతన అనుభవిస్తున్నారు.

☛ కొనకనమిట్ల మండల పరిధిలో పొదిలి-మార్కాపురం రహదారిలో అక్కడక్కడా గుంతలు పూడ్చినప్పటికీ అవి కంకర లేచి యథాప్రకారం దర్శనమిస్తున్నాయి. ఈ మండలంలోని వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే తారు రోడ్డు మొత్తం కంకర లేచి అడుగుకో గుంత ఏర్పడటంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గొట్లగట్టు నుంచి నాయుడుపేట ఎస్సీ కాలనీ వరకు ఉన్న తారు రోడ్డు గోతులమయమైంది. గనివానిపాడు, వాగుమడుగు రోడ్డు దెబ్బతిన్న విషయం అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని గనివానిపాడు సర్పంచ్ పాలూరి లక్ష్మీ సాంబ వెంకటేశ్వర్లు ఆరోపించారు.



బేస్తవారిపేట : ఒకవైపున రోడ్డు మధ్యలోకి కోతపడిన మార్జిన్



కొమరోలు : గోతులమయంగా మారిన సూరవారిపల్లి రహదారి



కొమరోలు : నిర్మాణ పనులు నిలిచిన యర్రగుంట్ల రహదారి



కొనకనమిట్ల : జాతీయ రహదారిపై మర్రిపాలెం వద్ద కంకర లేచిన రోడ్డు



అర్ధవీడు : ఛిద్రమైన అర్ధవీడు-దొనకొండ ఆర్అండ్‌బీ రోడ్డు



కొనకనమిట్ల : గనివానిపాడు-వాగుమడుగు రోడ్డు పరిస్థితి ఇదీ..



కొనకనమిట్ల : నాయుడుపేట ఎస్సీ కాలనీ రోడ్డు ఇలా..



కొమరోలు : తారు లేచి ఛిద్రంగా మారిన సూరవారిపల్లె రహదారి

బాలోత్సవ్‌లో యర్రబాలెం విద్యార్థినుల ప్రతిభ



ప్రథమ బహుమతి సాధించిన విద్యార్థినులు

కంభం: ఒంగోలులో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి బాలోత్సవ్–2025 పోటీల్లో కంభం మండలం యర్రబాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థినులు ప్రతిభ చాటారు. ఆదివారం జూనియర్ విభాగంలో నిర్వహించిన దేశభక్తి గేయాల పోటీల్లో విద్యార్థినులు దివ్య, రంగమీనాక్షి, అంజలి, రంగలక్ష్మి, దీక్షిత, అనిత, బ్లెస్సీ జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను, శిక్షణ ఇచ్చిన సంగీత ఉపాధ్యాయుడు ఎం.ఖాసింను ప్రధానోపాధ్యాయుడు ఏరువ లక్ష్మయ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి



ప్రత్యేక అలంకరణలో అల్లూరి పోలేరమ్మ తల్లి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయం, కళాశాల రోడ్డులోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అల్లూరి పోలేరమ్మ అమ్మవారిని ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన, పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పుట్ట, నాగశిలలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లు వండి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

వాస్మాల్ తాగి మహిళ ఆత్మహత్య



మృతురాలు శ్యామల(ఫైల్)

కంభం: వాస్మాల్ తాగి ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆదివారం కంభంలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని గోవిందాపురానికి చెందిన గుంటూరు శ్యామల(35)కు 14 ఏళ్ల క్రితం వివాహం కాగా 8 సంవత్సరాల వయసున్న కుమార్తె ఉంది. విభేదాల కారణంగా మూడేళ్ల క్రితం భర్త వెళ్లిపోగా ఆమె స్వగ్రామం గోవిందాపురంలోని పుట్టింట్లో నివాసం ఉంటోంది. కంభంలోని బస్టాండ్ సమీపంలో ఉన్న ఓ బేకరీలో పనిచేసుకుంటూ జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్ మహబూబ్ బాషాతో ఆమెకు పరిచయం ఏర్పడింది. కొంతకాలం సాన్నిహిత్యంగా ఉన్న ఇరువురి మధ్య డబ్బు, ఇతర విషయాల్లో గొడవలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం 11 గంటల సమయంలో బేకరీ వద్దకు ఆటో డ్రైవర్ వచ్చిన సమయంలో శ్యామల వాస్మాల్ తాగింది. వెంటనే అతను ఆమెను ముందుగా ఓ ప్రైవేట్ వైద్యశాలకు తీసుకెళ్లి అక్కడి నుండి ప్రభుత్వ వైద్యశాలకు తరలించాడు. మెరుగైన వైద్యం కోసం మార్కాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ఆమె అక్కడ మృతి చెందినట్లు తెలిసింది. అనంతరం ఆటో డ్రైవర్ కంభం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి శ్యామల చనిపోయిన విషయాన్ని చెప్పాడు. మార్కాపురం నుంచి వైద్యులు ఫోన్ చేయడంతో శ్యామల చనిపోయినట్లు తెలిసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

రాచర్ల: ప్రమాదవశాత్తూ ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఒకరికి గాయాలైన సంఘటన రాచర్ల మండలంలోని యడవల్లి హైవే క్రాస్ రోడ్డు సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలు.. యడవల్లి గ్రామానికి చెందిన షేక్.మహబుబ్ బాషా ఐస్ విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఐస్ బండిపై యడవల్లి గ్రామానికి వెళ్తుండగా.. ఎదురుగా వస్తున్న ట్రక్‌ను తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు ఒక్కసారిగా బ్రేక్ వేశాడు. బస్సు ఐస్ బండిని ఢీకొనడంతో మహబుబ్ బాషా కింద పడిపోయాడు. స్వల్పంగా గాయపడిన మహబుబ్‌బాషాను వెంటనే 108 వాహనంలో గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని చిరువ్యాపారి మృతి



సంఘటనా స్థలంలో బాబూరావు మృతదేహం



ప్రమాదానికి కారణమైన మొద్దుల ట్రాక్టర్

తర్లుపాడు: మొద్దుల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో ఓ చిరువ్యాపారి అక్కడికక్కడే మృతి చెందారు. ఈ సంఘటన తర్లుపాడు మండలంలోని చెన్నారెడ్డిపల్లి వద్ద సోలార్ ప్లాంట్ సమీపంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. మృతుని బంధువుల కథనం మేరకు.. మార్కాపురానికి చెందిన బాబూరావు(58) ద్విచక్ర వాహనంపై గ్రామాల్లో తిరుగుతూ మిక్చర్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో వ్యాపారం ముగించుకుని చెన్నారెడ్డిపల్లి నుంచి మార్కాపురం బయలుదేరారు. సోలార్ ప్లాంట్ సమీపంలో మొద్దుల లోడుతో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఓ కుమారుడు.. నలుగురు కుమార్తెలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మృతుడి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మార్కాపురం డివిజన్
99516 02963 (మార్కాపురం)
99122 25435 (గిద్దలూరు)
Office mail : sakshiongads@gmail.com